ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు

నూజివీడు: నూజివీడు, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ప్రజలకు మంచి జరగాలని, సుఖ సంతోషాలతో జీవించి, అభివృద్ధి చెందాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రతాప్ అప్పారావుకు శుభాకాంక్షలు తెలిపారు. అభిమానుల మధ్య మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కేక్ కట్ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ, కో ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, జెడ్పీటీసీలు పిన్నిబోయిన వీరబాబు, వరికూటి ప్రతాప్, చెల్లికాని అనూష, ఎంపీపీలు ఆరేపల్లి శిరీష, కొండా దుర్గాభవాని, గోళ్ల అనూష, చాట్రాయి వైస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

జోగి రమేష్‌కు న్యూ ఇయర్ శుభాకాంక్షలు

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ మంత్రి జోగి రమేష్‌ను జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ ఇబ్రహీంపట్నంలోని ఆయన నివాసంలో బుధవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ సీనియర్ నాయకుడు వేములకొండ సాంబయ్య పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో..

నూజివీడు: అణగారిన బలహీన వర్గాల అభివృద్ధి కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు గౌతు లచ్చన్న అని సీపీఐ రాష్ట్ర నాయకుడు చలసాని రామారావు అన్నారు. బస్టాండు సెంటర్‌లో ఉన్న గౌతు లచ్చన్న కాంస్య విగ్రహం వద్ద బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. నాయకులు మరీదు శివ రామకృష్ణ, పామర్తి అచ్చేశ్వరరావు, చలమాల వెంకటేశ్వరరావు, మాదాసు చంద్రకళ, చెన్నారావు, జగన్, మడుపల్లి నాగేంద్ర, చలమల కిరణ్, చింతా అనిల్, కొనకల జగదీష్, చీపు సాయికృష్ణ, పాపారావు, అన్వర్ పాల్గొన్నారు.

రంగవల్లులతో నిండిన ముంగిళ్లు

నూజివీడు: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి మహిళలు తమ ఇళ్ల ముంగిళ్లలో వేసిన రంగవల్లులు ఆకట్టుకుంటున్నాయి. ఎంప్లాయీస్ కాలనీ, అమ్మవారితోట, కోనేరుపేట, సమతానగర్, సిబ్బందిపేట, కొత్తపేట, బంగినపల్లితోట, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్ల ముంగిళ్లన్నీ ముగ్గులతో నిండిపోయాయి.

చాట్రాయిలో వేడుకలు

చాట్రాయి: బూరుగుగూడెం గ్రామంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ మాజీ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి గృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య భారీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లంకా నిర్మల, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, నాయకులు కారంగుల వాసు, చెలికాని బాబ్జీ, గడ్డం లోకేశ్వరరెడ్డి, పుచ్చకాయల అప్పిరెడ్డి, పరసా చెన్నారావు, తిరువీధి రమేష్, చల్లగుళ్ల వెంకటేశ్వరావు, పామర్తి నాగేశ్వరావు, మాదల నరసింహారావు, మిద్దె శివాజీ, వనమా వాసు, జల్లేపల్లి పరమేశ్వరావు, సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, ఉప సర్పంచ్ దిరిశాల చిన బాబు, మందపాటి రఘుపతిరెడ్డి విస్సంపల్లి సీతయ్య ఎంపీడీఓ విజయలక్ష్మి తదితరులు దేశిరెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ముసునూరులో..

ముసునూరు: ముసునూరు ఆర్సీఎం చర్చిలో విచారణకర్త రెవరండ్ ఫాదర్ జోసఫ్‌తంబి, సహాయక ఫాదర్ ఇలవర్సన్, సిస్టర్లు సుధారాణి, జాన్సల్, వినీల, ఉపదేశి బెనర్జీ, సంఘపెద్దలు, సెయింట్ జోసఫ్ యూత్ సభ్యులతో కలిసి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కాట్రేనిపాడు సీఎస్ఐ హోలీ నూతన చర్చిలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కంబాల రాంబాబు కేక్ కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పలు కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది నిరాడంబరంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మైలవరంలో..

మైలవరం: మండలంలోని క్రీస్తు దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఆర్సీఎం చర్చిలో ఫాదర్ రెవరెండ్ కె.అనిల్ ఫ్రాన్సిస్ ప్రార్థనలు నిర్వహించి విశ్వాసులకు ఆశీర్వచనాలు అందజేశారు. క్రైస్తవులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

విజయభాస్కరరెడ్డికి శుభాకాంక్షలు

మైలవరం: రెడ్డిగూడెం జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డిని వైఎస్సార్ సీపీ రెడ్డిగూడెం మండల ఎస్సీ, బీసీ సెల్ నాయకులు బుధవారం ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తమ్మక తిరుపతిరావు, చాట్ల రామారావు ఉన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: నూతన సంవత్సర వేడుకలు ఉల్లాసభరిత వాతావరణంలో జరిగాయి. యువకులు బైకులపై కేరింతలు కొడుతూ వీధుల్లో హల్‌చల్ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుని స్వీట్లు పంచుకున్నారు. ఇళ్ల ముందు ముగ్గులతో అలంకరించి 2025 ఏడాదికి స్వాగతం పలికారు. అర్ధరాత్రి నుంచి పలు ఆలయాలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆర్సీఎం, సీఎస్ఐ, పెంతుకోస్తు, క్రీస్తుసంఘం తదితర ఆలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ది ఇండియా పెంతుకోస్తు సంఘం చర్చిలో మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ సతీమణి శకుంతలమ్మ, సోదరుడు, వార్డు కౌన్సిలర్ జోగి రాము, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొని ప్రార్థనలు జరిపారు. క్యాలెండర్లు ఆవిష్కరించారు.

ఆనందోత్సాహాలతో స్వాగతం

తిరువూరు: మంగళవారం అర్ధరాత్రి నుంచి పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తిరువూరులోని శ్రీవేంకటాచలస్వామి ఆలయం, శ్రీకోదండ రామాలయం, రాజుపేట వీరాంజనేయస్వామి దేవస్థానాలలో జరిగిన పూజాదికాల్లో భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నివాసంలో ఆయనను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జన విజ్ఞాన వేదిక రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో తిరువూరు ఆర్టీసీ డిపో ఎదుట వేడుకలు జరిపారు. సీపీఐ కార్యాలయంలో జిల్లా మాజీ కార్యదర్శి తూము కృష్ణయ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. యూటీఎఫ్ కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను యూనియన్ నాయకులు మచ్చా శ్రీనివాసరావు, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఎంపీడీఓ రవిబాబును పంచాయతీ కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గంపలగూడెంలో ప్రత్యేక ప్రార్థనలు..

గంపలగూడెం: చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో అధిక సంఖ్యలో విశ్వాసకులు పాల్గొన్నారు. పాస్టర్ల ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేసి, శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ, మురళీకృష్ణ దంపతులు



మాజీ మంత్రి జోగి రమేష్‌కు బొకే అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, సాంబయ్య



మైలవరంలో దైవ సందేశమిస్తున్న ఫాదర్ రెవరెండ్ అనిల్ ఫ్రాన్సిస్



తిరువూరు ఆర్టీసీ బస్ డిపోలో వేడుకలు



యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న మచ్చా శ్రీనివాస్ తదితరులు



తిరువూరులో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



బూరుగుగూడెంలో కేక్ కట్ చేస్తున్న దేశిరెడ్డి దంపతులు



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న గౌడ సంఘం నాయకులు



ఇబ్రహీంపట్నం ప్రార్థనల్లో మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులు, బంధువులు



జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ జోసఫ్‌తంబి

350 మందికి వస్త్రాల పంపిణీ

ఇబ్రహీంపట్నం: ప్రసాద్‌నగర్ క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు పురస్కరించుకుని 350 మంది వితంతువులు, అనాథ బాలలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. విజయబేరి కన్‌స్ట్రక్షన్స్ అధినేత రౌతు లీలాధర్ కుమార్ ఆర్థిక సహకారంతో బుధవారం వస్త్రాలు అందజేశారు. సంఘ పెద్దలు నల్లమోతు విజయరావు(చంటి), జి.సత్యనారాయణ, ఎం.రాఘవ, సీహెచ్ కృష్ణ, ఎం.నాగరాజు, ఎస్.ప్రసాద్, నల్లమోతు సువర్ణప్రసాద్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



వస్త్రాలు పంపిణీ చేస్తున్న లీలాధర్‌కుమార్, విజయరావు

క్లుప్తంగా

శేషాచల శ్రీనివాసస్వామికి వెండి బిందె వితరణ



మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను శివారు మెట్టగుట్ట శ్రీశేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల సమయంలో వినియోగించేందుకు అవసరమైన వెండి బిందెను భక్తుడు బుధవారం వితరణ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం మధిర పట్టణానికి చెందిన నాళ్ళా శ్రీనివాసరావు, సౌజన్య దంపతులు రూ.55 వేల విలువైన వెండి బిందెను ఆలయ కమిటీ చైర్మన్ పి.వెంకట్రామ్‌కు అందజేశారు. దాత దంపతులను అర్చకులు శ్యామసుందరాచార్యులు ఆశీర్వదించి, ప్రసాదం ఇచ్చారు. ఆలయ కమిటీ కోశాధికారి ఎన్.నారాయణరావు, సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరెడ్డి, వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించడం అలవర్చుకోవాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి సందేహాలు నివృత్తి కోసం ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలని ప్రముఖ వైద్యుడు, సర్జన్ మామిడి సీతారామారావు తెలిపారు. కొండపల్లిలో జనవిజ్ఞాన వేదిక వార్షిక సమావేశం బుధవారం నిర్వహించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్ మాట్లాడుతూ.. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమన్నారు. ఈ ఏడాది చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ వి.అమ్మాజీ, పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.నాగరాజు, సర్దార్ సాహెబ్ పాల్గొన్నారు.

కనులపండువగా ముగ్గురమ్మల జాతర



దొనబండ(ఇబ్రహీంపట్నం): మండలంలోని దొనబండ గ్రామంలో వేం చేసి ఉన్న ముగ్గురమ్మల ఆలయ జాతర కనులపండువగా జరిగింది. 50 ఏళ్ల క్రితం తమిళనాడు నుంచి వలస వచ్చిన క్వారీ కార్మికులు మారెమ్మ, కాళియమ్మ, సత్తెమ్మ అమ్మవార్లను ప్రతిష్ఠించుకుని ఆలయాలు నిర్మించారు. ప్రతి ఏడాది జనవరి నెల మొదటి బుధవారం జాతర జరపటం ఆనవాయితీగా వస్తోంది. ఆలయకమిటీ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ జాతరలో పాల్గొని ముగ్గురమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్థిక సాయం అందజేత

మైలవరం: మైలవరం గ్రామానికి చెందిన దబ్బెర రాంబాబు కుమారుడు నరేంద్ర ఎంబీబీఎస్ చదువుతున్నాడు. నరేంద్ర చదువులో మంచి మార్కులతో రాణిస్తూ పేదరికం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. విషయం తెలుసుకున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులందరూ కలిసి నరేంద్ర రెండో సంవత్సరం ఫీజు నిమిత్తం రూ.5 వేలను రాంబాబుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు రాంబాబు కృతజ్ఞతలు తెలియజేశాడు. అలాగే విశ్రాంత ఉద్యోగుల సంఘం తరఫున రూ.10 వేలు అందజేశారు.

కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: దాతల తోడ్పాటుతో ఇప్పటి వరకు 632 దివ్యాంగులకు హైటెక్ కృత్రిమ కాళ్లను అందజేసినట్లు హీల్ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నన్నూ విజయ్ తెలిపారు. మండలంలోని తోటపల్లిలో హీల్ అవయవ కేంద్రంలో దాతలు ఇచ్చిన ఆర్థిక సహాయంతో ఇద్దరు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అమర్చారన్నారు. కార్యక్రమంలో కృత్రిమ కాళ్లను అందజేసిన దాతలు చలసాని పూర్ణ బ్రహ్మయ్య, ఝాన్సీ లక్ష్మి, శ్రీనివాస్ ప్రసాద్, శ్రీలత పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

తిరువూరు: తిరువూరు సమీపంలోని అక్కపాలెం రోడ్డులో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. పట్టణ శివారులోని మామిడితోటలో పేకాడుతున్నట్లు సమాచారం అందుకున్న సెక్టార్–1 ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలసి దాడి చేయగా ఐదుగురు జూదరులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.6,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గత నెలలో 12,510 లీటర్ల సారా ధ్వంసం

నూజివీడు: నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గత నెలలో నిర్వహించిన దాడుల్లో 12,510 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేయడంతో పాటు 369 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. దీనిలో భాగంగా 41 కేసులు నమోదు చేయగా అందులో 35 కేసులు సారాకు సంబంధించినవని, అందులో 26 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఎవరైనా ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతుంటే 94409 02462 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలన్నారు.

శోభనాచలుడికి ప్రత్యేక పూజలు

ఆగిరిపల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆగిరిపల్లిలో వేంచేసియున్న శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామిని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శేషుబాబు ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పల్లగాని నరసింహరావు, సర్పంచులు రాఘవరపు సురేష్, వేమురాజు, పల్లగాని జమదగ్ని, నాయకులు పల్లె రవీంద్ర రెడ్డి, శీలం రాము, నక్కనబోయిన శ్రీమన్నారాయణ, సండూరి భాస్కర్ ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాయిబాబాకు విశేష పూజలు

ఆగిరిపల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని షిరిడీ సాయిబాబా ధ్యాన మందిరంలో విశేష పూజలు నిర్వహించారు. సింగన్నగూడెం బస్టాప్ వద్ద ఉన్న సర్వ కార్యసిద్ధి షిరిడీ సాయిబాబా ధ్యాన మందిరంలో బుధవారం బాబా వారికి క్షీరాభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలను ఆలయ అర్చకుడు దేవులపల్లి లక్ష్మీనరసింహమూర్తి నిర్వహించారు. వీరమచనేని ఉమామహేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో 3 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



స్వామివారి సేవలో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

కనులవిందుగా శ్రీపుష్పయాగం

గంపలగూడెం: గంపలగూడెం సీతారామచంద్ర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామికి శ్రీపుష్పయాగం కనులవిందుగా జరిగింది. ముందుగా ఆలయ అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు, రామాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల పూలతో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి పూలతో విశేష పూజ చేశారు. వికాస తరంగిణి అధ్యక్షురాలు సముద్రాల జ్యోతి, ప్రధాన కార్యదర్శి హెచ్చా సుధారాణి, కొల్లా నాగేశ్వరరావు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

గంపలగూడెం నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినగడపలో సత్యభామ, రుక్మిణీ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. ఈసందర్భంగా హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. మండలంలోని పెనుగొలను, ఊటుకూరు, గంపలగూడెం రామాలయాల్లో, భజనమందిరంలో నిర్వహించిన గోష్ఠిలో మహిళలు తిరుప్పావై పఠనం, గోదాచతుశ్లోకి, కృష్ణాష్టకం పఠనం తదితర కార్యక్రమాలు ఘనంగా జరిపారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మానవత్వమే అన్ని మతాల సారాంశం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మానవత్వమే అన్ని మతాల సారాంశమని, ఏ మతమైనా సోదర భావంతో మెలగాలని చెబుతుందని సూఫీ మత గురువు అల్తాఫ్‌రజా అన్నారు. కొండపల్లి హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా నిత్య అన్నదాన లంగర్ ఖానాలో అయ్యప్ప దీక్షాధారులకు బుధవారం సద్ది(భోజనం) ఏర్పాటు చేశారు. ముందుగా షాబుఖారి దర్గాలో చాదర్, పూలు సమర్పించి ప్రార్థనలు చేసిన అనంతరం సద్ది స్వీకరించారు. అల్తాఫ్ బాబా మాట్లాడుతూ.. అన్ని మతాల సారాంశం సాటి వారిని సోదర భావంతో చూడటమేనన్నారు. అయ్యప్ప స్వాములకు ముస్లింలకు ఆత్మీయ అనుబంధం ఉందని, శబరిమల యాత్ర ప్రారంభానికి ముందు ఓవర్ స్వామి దర్శనం చేసి యాత్ర ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.



దర్గాలో సద్ది స్వీకరిస్తున్న అయ్యప్ప దీక్షాధారులు

మామిడిపైనే రైతుల ఆశలు

ఆశాజనకంగా పూతలు

నూజివీడు: నియోజకవర్గంలోని రైతాంగం ఆశలన్నీ మామిడిపైనే ఉన్నాయి. నాలుగు మండలాల్లో రైతులు సార్వా సీజన్‌లో వరి పంట, రబీ సీజన్‌లో మొక్కజొన్న పంటలను సాగు చేస్తారు. అయితే ఈ ప్రాంతంలో మామిడి తోటలు కూడా అధిక విస్తీర్ణంలో ఉండటంతో రైతులు ఆశలన్నీ మామిడిపైనే పెట్టుకున్నారు. పండ్లలో రారాజు మామిడి అని పేరున్నప్పటికీ ఈ పంట ఒక ఏడాది కాస్తే మరో ఏడాది కాయదు. ఈ ఏడాది మామిడి తోటల్లో పూతలు కనిపిస్తుండటంతో ఆశాజనకంగా ఉంటుందనే ఆలోచనతో రైతులు ముందుకు సాగుతున్నారు. తోటల్లో అక్కడక్కడ గచ్చకాయ సైజు పిందెలు కనిపిస్తుండగా తెల్లపూత, పచ్చిపూత దశలో తోటలు ఎక్కువగా ఉన్నాయి. వచ్చిన పూతలను నిలుపుకునేందుకు, పూతలు రాని తోటల్లో పూత వచ్చేందుకు రైతులు రసాయన మందులను పిచికారీ చేస్తున్నారు.

నియోజకవర్గంలో 33,841 ఎకరాలు

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మామిడి విస్తీర్ణం 33,841 ఎకరాల్లో ఉంది. ఈ తోటల నుంచి ఏటా 1.35 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి వస్తుందని మార్కెటింగ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం విస్తీర్ణంలో 60 శాతం బంగినపల్లి రకం, 20 శాతం తోతాపురం, మిగిలిన 20 శాతం చిన్న రసాలు, ఇతర రకాలు ఉన్నాయి. మామిడి తోటలు డిసెంబర్ మొదటి వారం నుంచి జనవరి ఆఖరు వరకు పూతలు పూస్తాయి. ఆ తరువాత ఫిబ్రవరి మొదటి వారం నుంచి ముదురు పూత వచ్చిన తోటల్లో కాయలు కోతకు వస్తాయి. మే ఆఖరు వరకు మామిడి కాయల కాపు వస్తోంది. మామిడి తోటలను రైతులు కొందరు కాపు వరకు వ్యాపారులకు విక్రయించడం, మరికొందరు తామే కాయలు కోసి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. వ్యాపారులైతే ముంబాయి మార్కెట్‌కు ఎగుమతి చేస్తున్నారు. అక్కడ మామిడికి అధిక ధర లభిస్తుండటంతో రైతులు, వ్యాపారులు ముంబాయి మార్కెట్‌కు తోలడానికే మొగ్గు చూపుతున్నారు.



రావిచర్లలో పూత పూసిన మామిడి తోట

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
నూజివీడు	10,434	41,736
ఆగిరిపల్లి	17,765	71,060
చాట్రాయి	3,619	14,476
ముసునూరు	2,023	8,092
మొత్తం	33,841	1,35,364

రసాయన మందులు పిచికారీ చేయొద్దు



ప్రస్తుతం మామిడి తోటలు తెల్లపూత, పచ్చిపూత దశ, పూమొగ్గ దశలో ఉన్నాయి. తెల్లపూత వచ్చిన తోటల్లో రైతులు ఎలాంటి రసాయన మందులు పిచికారీ చేయొద్దు. దీనివల్ల పరపరాగసంపర్కానికి తోడ్పడే పురుగులు, కీటకాలు నశించి పూత పిందెగా మారకుండా ఉంటుంది. దీనివల్ల రైతులకు నష్టం వాటిల్లుతుంది. ఇంకా పూత రానియెడల పూత కోసం పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, బోరాన్ 2గ్రాములు, జింకు 2గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

– కణితి రాధారాణి, మామిడి శాస్త్రవేత్త

కత్తితో దాడి చేయడంతో గాయాలు

మైలవరం: కత్తితో దాడి చేయడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన బుధవారం మైలవరంలో జరిగింది. మైలవరం డౌన్ సెంటర్‌కు చెందిన మహ్మద్ ఇషాన్(32) ఏసీ మెకానిక్‌గా కొంతకాలం, అనంతరం బిర్యానీ పాయింట్‌లో మరి కొంతకాలం పనిచేశాడు. ఇదే గ్రామానికి చెందిన షేక్ సుభానీ(30) నూజివీడు రోడ్డులోని పండు బిర్యానీ పాయింట్‌లో పనిచేస్తున్నాడు. వీరిద్దరూ మూడు రోజులుగా గొడవ పడుతున్నారు. ఇషాన్ బుధవారం సాయంత్రం నూజివీడు రోడ్డులోని చికెన్ సెంటర్ వద్ద నిలబడి ఉన్నాడు. ఇది గమనించిన సుభానీ చికెన్ సెంటర్‌లో చికెన్ కొడుతున్న వ్యక్తి నుంచి కత్తి లాక్కుని ఇషాన్‌పై దాడి చేశాడు. దీంతో ఇషాన్‌కు మెడ, వీపు, చెయ్యిపై తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రేపటి డిగ్రీ పరీక్ష వాయిదా

తిరువూరు: ఈ నెల 3వ తేదీ శుక్రవారం జరగాల్సిన కృష్ణా విశ్వవిద్యాలయ ప్రథమ సంవత్సర డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షను వాయిదా వేసినట్లు తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీల్‌రావు తెలిపారు. ఈ పరీక్షను జనవరి 6న నిర్వహించాలని విశ్వవిద్యాలయం ఆదేశించిందన్నారు.